నర్సింహా సంచిలోంచి బాటిల్స్ తీసి పక్కన పెట్టాడు. మూతలు తీసి ఒక బాటిల్ యాదవరెడ్డి కిచ్చాడు. రెండో బాటిల్‌తను తీసుకున్నాడు.

"ఒరే నర్సింహా......మనకు టైం లేదు. రేపు మధ్యాహ్నం మనవాళ్ళందరితో కలిసి మనం బొంబాయి వెళ్ళాలంటే ఇవాళ రాత్రి యీ పనిని గప్‌చుప్‌గా చేసుకుని రేపుదయానికల్లా మనం హైద్రాబాద్‌లో వుండాలి....అర్థమైందా?" కుమారస్వామి సీరియస్‌గా అన్నాడు.

"టాక్సీ తీసుకుంటే రేపటికి హైద్రాబాద్‌లో వుంటాం కంగారెందుకురా?" బాటిల్‌ని సగంవరకూ పూర్తి చేస్తూ అన్నాడు నర్సింహ

"చూడు యాదవరెడ్డి ......ఇప్పుడీ వ్యవహారమ విషయం వదిలెయ్. పిల్ల బాగుంటుండంటున్నావ్. బంగారుబొమ్మలా వుంటుందంటున్నావ్..........ఇంకోమాట......ఇకనుంచి మీ వూళ్ళోనే కాదు......చుట్టుపక్కల వూళ్ళల్లో ఎక్కడన్నా మంచిపిల్లలుంటే చూడు నెలకు ఒక్కర్ని అప్పగించావనుకో.....నువ్వూ హాయిగుంటావ్. మేవూ హాయిగుంటాం"

తన పరిస్థితి అలా దిగజారిపోయినందుకు మనసులోనే బాధపడ్డాడు యాదవరెడ్డి.

మరో అరగంట గడిచింది. ఖాళీ సీసాల్ని పక్కకు తోసేసి, అరుగు మీంచి దిగి-

యాదవరెడ్డి వెనక వూళ్ళోకి నడవడం మొదలుపెట్టారు. కుమార స్వామి, నర్సింహ.

దూరంగా ఊరు......మసక వెలుతురులో వూరంతా మట్టిముద్దలా కన్పిస్తోంది

"మీరిక్కడే వుండండి. పిల్లని తీసుకొస్తాను" యాదవరెడ్డి వూళ్లోకి అడుగుపెట్టాడు

శిధిల దేవాలయం దగ్గరకొచ్చాడు.

శివలింగం ముందు వెలుగుతున్న దీపంవైపు వింతగా చూశాడు.

ఎప్పుడూ వెలగని దీపం ఆ వేళ వెలగడం ఆశ్చర్యంగా వుందతనికి.

తలదించుకొని గుడిసె వైపు భారంగా అడుగులు వేశాడతను.

*       *       *       *       *       *

గుడిసెలో ఆముదపు దీపం ఆఖండదీపంలా వెలుగుతోంది.

గుడిసె మధ్యలో నిద్రరాక ఆటూ ఇటూ పొర్లుతున్న లక్ష్మి అడుగుల చప్పుడికి తలతిప్పి చూసింది.

తండ్రి యాదవరెడ్డి.

"నాన్నా" ఏడుపు గొంతుతో గబుక్కున లేచి తండ్రిని చుట్టేసింది లక్ష్మి

"చెప్పకుండా ఎక్కడకు వెళ్ళిపోయాక నాన్నా?" కూతురి ప్రశ్నకు తండ్రి దగ్గర జవాబు లేదు.

"పనేదైనా దొరుకుతుందేమోనని  పట్నం వెళ్ళానమ్మా" సంచిలోంచి అన్నం పొట్లం తీసి, విప్పి కూతురి ముందు పెడుతూ అన్నాడు యాదవరెడ్డి

అన్నం మెతుకుల్ని చూడగానే లక్ష్మి కళ్ళు వింతగా మెరిశాయి.  ఆమె చేతివేళ్ళు పొట్లం వైపు కదిలాయి

గ్లాసుతో నీళ్ళు తెచ్చి పక్కన పెట్టాడు తండ్రి.

సాయంత్రం తను పది రూపాయలు సంపాదించి దాచిన విషయాన్ని తండ్రితో చెప్దామనుకుని ఎందుకో చెప్పలేకపోయింది లక్ష్మి.

"పని దొరికిందా నాన్నా?" అన్నం తింటూ అమాయకంగా అడిగింది లక్ష్మి.

తల్లీ, తండ్రి మధ్య తను కళకళగా తిరిగిన రోజులు, ఏదో తెలియని జబ్బొచ్చి తల్లి తనతో చెప్పకుండా వెళ్ళిపోయిన రోజులు, అంతవరకూ వ్యవసాయం చేసిన తండ్రి అకస్మాత్తుగా బండి లాగుతూ కాలం గడిపిన రోజులు, ఆకలితో పాటు ఊరు కూడా రోజుకు తిరిగి పోతున్న రోజులు, ఆకలితో మనుషులు చచ్చిపోతున్న రోజులు, ఆకలితో మనుషులు వూరు విడిచి పారిపోతున్న రోజులు, ఎక్కడ చూసిన ఆకలిమంటలు చెలరేగిన రోజులు, వూళ్ళో వున్న ఒకానొక మంచినీటి భావి కూడా ఎండిపోయిన రోజులు-

చెట్టులాంటి తండ్రి మోడులా మారిపోయి   తాగుడికి, వ్యసనాలకు బానిసైన రోజులు, ప్రతిక్షణం ఆకలితో బాధపడుతున్న రోజులు, కళ్ళవెనక దు:ఖాన్ని, మనసు వెనక బాధని దాచుకోడానికి అలవాటుపడి, రాని నవ్వుని నవ్వుతూ ఊళ్ళో పరిగెడుతున్న రోజులు-

బాల్యం కెమెరా లాంటిది.

ఎన్నెన్నో విషాదల నెగెటివ్స్‌నో దాచుకుంటుందది.

"లేదమ్మా ........లేదు....పని నాకు దొరకలేదు.  కానీ .....నువ్వు అదృష్ట వంతురాలివి తల్లీ నీకు పని దొరికిందమ్మా........ఇక్కడ కాదు బొంబాయిలో.......హాయిగా  నిన్ను చూసుకునే మనుషులు దొరికారమ్మా"

ఆ మాటలు చెప్తున్న తండ్రి వైపు ఆశ్చర్యంగా చూసింది.  లక్ష్మి.

"బొంబాయి అంటే ఏంటి నాన్నా?" అమాయకంగా అడిగింది లక్ష్మి.

"బొంబాయి అంటే అదో ఊరమ్మా.....పెద్ద వూరు.....పేదరికం లేని వూరు........దరిద్రం లేని వూరు.....నువ్వు కార్లల్లో తిరిగే వూరు.......అందుకే ......అందుకే.....బొంబాయి వెళ్తావు కదమ్మా?" నీళ్ళు నిండిన కళ్ళతో అడిగాడు యాదవరెడ్డి.

"నువ్వూ వస్తావు కదూ నాన్నా! అప్రయత్నంగా అడిగింది.  లక్ష్మి.

"ఇప్పుడు రాను.  తర్వాత వస్తాను........తర్వాత.....నువ్వు సుఖంగా వున్నావని తెలిసిన అప్పుడు .......నీ దగ్గరే వుంటాను కదమ్మా" ఆ తండ్రి గుండె అప్పటికే పగిలిపోయింది ఆ తండ్రి గుండె అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేసింది.

"బట్టలు సర్దుకో .....బయలుదేరదాం" మాట అనేసి నాలిక కరచుకున్నాడు యాదవరెడ్డి

వంటి మీద చిరుగుల బట్టలు తప్ప మరేవీ బట్టలు.....తన చిన్నారి కూతురికి వున్నది ఒకే ఒక జత. వంటి మీదు చిరుగుల జత.

"లెక్కల మాస్టారు భుజమ్మీద కండువా యిచ్చారు. ఇది మడత బెట్టుకుంటాను" దూరంగా వున్న కండువాను అందుకుని మడతబెట్టుకుంది.

లక్ష్మి.

చీకటి దట్టంగా అసుముకుంటోంది.

గుడిసెలోంచి బయటికొచ్చింది లక్ష్మి.

అటూ ఇటూ భయం చూస్తున్న తండ్రి యాదవరెడ్డి కళ్ళలోని తెలీని బాధను పసిగట్టలేకపోయింది ఆ పసిమనసు.

ఊరు మధ్యలో కొచ్చింది.

శివుని ముందు దీపం వెలుగుతునే వుంది. ఊరు దాటుతుంటే ఏడుపొచ్చింది లక్ష్మికి దాంతో కళ్ళెంట నీళ్ళొచ్చేశాయి.

ఆ కన్నీళ్ళు వెచ్చగా వున్నాయి.

* * * * * * *

మాసి పోయిన కుందనపు బొమ్మలా వున్న లక్ష్మిని చూడగానే సంబరపడ్డాడు కుమారస్వామి.

"రోజూ పావుకేజీ మాంసం పెట్టి, పట్టుబట్ట కడితే పిల్ల హిందీ సినిమా స్టారై పోదూ.....చూడు యాదవరెడ్డీ.......పిల్లని చూడకుండా మూడువేలన్నాను పిల్లని చూసి అంటున్నాను. అయిదు వేలు......ఇదిగో" జేబులోంచి కొత్త కరెన్సీ కట్టని తీసి చేతిలో పెడుతూ అన్నాడు కుమార స్వామి.

"ఊరు కాని ఊరు, భాష కాని భాష.......పిల్లనే ప్రమాదం లేదుకదా?" భయంగా అడిగాడు యాదవరెడ్డి.

"ఎన్నిసార్లు అడుగుతావని......బొంబాయిలో ఎంతో మంది ధనవంతులు యాభై, అరవై ఏళ్ళ వాళ్ళు.......పెద్ద పెద్ద భవంతుల్లో ఎవ్వరూ లేకుండా వుంటారా......వాళ్ళూ ఇలాంటి పిల్లల్ని, పెద్ద పెద్ద జీతాలిచ్చి ఇళ్ళల్లో వుంచుకుంటారా.......ఈ పనిపిల్లలు మంచిగా వున్నారనుకో........వాళ్ళు చచ్చిపోయేముందు వాళ్ళ లక్షల ఆస్తిని వీళ్ళ పేరున రాసేసి చచ్చి పోతుంటారు. నీ కూతురు అదృష్టవంతురాలైతే,ఆ పెంచుకున్న వాడు చచ్చాడనుకో. టక్కున నీకూతురు లక్షాధి కారు అయిపోతుంది.

పక్కనున్న నర్సింహ వైపు చూసి మాయ నవ్వు నవ్వాడు కుమారస్వామి.

"ఏదో మాట చలవ .......మీ దయవల్ల దాని బ్రతుకు బాగుపడితే"

అంతకుమించి మాటాడలేకపోయాడు యాదవరెడ్డి.

వాళ్ళు నలుగుతూ రైల్వేస్టేషన్ చేరేసరికి బాగా తెల్లవారిపోయింది.

హైద్రాబాద్ వెళ్ళే ట్రైన్ అప్పటికే స్టేషన్లో వుంది.

ఇద్దరూ లక్ష్మిని తీసుకొని సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్‌లోకి అడుగుపెట్టారు.

వాళ్ళిద్దరూ తీరుబడిగా సీట్లలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

కళ్ళనీళ్ళతో కంపార్టుమెంటు డోరు దగ్గర నుంచుంది లక్ష్మి.

కూతురు జుత్తు నిమిరి, బుగ్గమీద ముద్దు పెట్టుకొని, కళ్ళలోకి ప్రేమగా చూసి-

"భయపడకమ్మా! నీ మంచి కోరే నిన్ను పంపుతున్నాను నువ్వు ఎక్కడున్నా నీ వెనక నేను, మీ అమ్మ వుంటాం. నువ్వెక్కడున్నా. ఎలా వున్నా కన్న ఊరుని మరిచిపోకమ్మా......." ఆ తండ్రి హృదయంలో ఏదో తెలియని బడబాగ్ని.

"నాన్నా! నన్ను చూడ్డానికి అప్పుడప్పుడు వస్తావు కదూ!"

"వస్తానమ్మా! ఎందుకు రాను? నేను రాకపోయినా నువ్వు బెంగపడకు. బాధపడకు ఆ యిద్దరు మావయ్యలూ చాలా మంచివాళ్ళు, నీకేదైనా బాధకలిగితే వాళ్ళిద్దరితో చెప్పుకో. ఏం........."

అమాయకంగా తలూపింది లక్ష్మి.

ఫ్లాట్‌ఫారమ్మీద అలజడి పెరిగింది.

దూరంగా రెడ్‌లైటు గ్రీన్ లైటుగామారింది.

"అమ్మా లక్ష్మీ! ఎవరికీ ఎప్పుడూ భయపడకమ్మా! అమాయకంగా వుండకమ్మా! ధైర్యం........ ధైర్యంగా బతుకమ్మా......" ఆ తండ్రి కళ్ళలో ట్రైను నెమ్మదిగా కదలడం మొదలయింది.

అప్పుడు జ్ఞాపకానికొచ్చింది. యాదవరెడ్డికి.....గబుక్కున జేబులో చెయ్యి పెట్టాడు. అయిదువేల రూపాయల నోట్లకట్ట చేతిలోకి తీసుకున్నాడు.

ట్రైను నెమ్మదిగా వేగం పుంజుకుంటోంది.

ప్లాట్ ఫారమ్మీద పరిగెడుతున్నాడు యాదవరెడ్డి.

"అమ్మా! ఈ డబ్బు నువ్వుంచుకో నాకిక్కడ డబ్బు అఖ్ఖర్లేదమ్మా! ఈ డబ్బు......." చెయ్యి ముందుకు సాచాడతను.

తండ్రి చెయ్యి కూతురికి అందడంలేదు.

జనం మధ్యలోంచి పరిగెడుతున్నాడు ఆ తండ్రి.

డోరు దగ్గర నిల్చున్న జనం మధ్యలోంచి తండ్రి చేతిని అందుకోడానికి ప్రయత్నిస్తోంది లక్ష్మి.

లాభంలేదు......తండ్రికి ఆ చెయి అందదు. తండ్రి ముఖం ఆ పని పిల్లకు కనబడదు.

ట్రైను ప్లాట్‌ఫారం దాటిపోతోంది మరింత వేగం పుంజుకుంది.

పరిగెడుతున్నాడు యాదవరెడ్డి.

"అమ్మా.......లక్ష్మీ.......లక్ష్మీ......." ఊపిరిని, కన్నీళ్ళనూ బిగపట్టుకుని ఆ డబ్బును కూతురికి యివ్వడానికి తండ్రి పరిగెడుతున్నాడు.

కళ్ళనిండా నిండిపోయిన కన్నీళ్ళ వలన ముందు ఏదో మసక! చేతిలో అయిదువేల రూపాయల నోట్లకట్ట!

వేగంగా పరుగెడుతున్న యాదవరెడ్డికి ఎవరో మనిషి అడ్డుగా వచ్చాడు.

అంతే.......

మరుక్షణం అతని చేతిలోంచి నోట్లకట్ట చెయ్యి జారిపోయింది.

గాలికి ఆ నోట్లు ఎగురుతున్నాయి.

ప్లాట్‌ఫారం దాటిపోతున్న చివరి బోగీసి పట్టుకుని పరిగెట్టబోయిన అతను.......

కాలు జారిపోవడం, ప్లాట్‌ఫారానికి, చివరి భోగీకీ మధ్య పడిపోవడం........

అంతే........

క్షణాల్లో జరిగిపోయింది.

ఆ దారణం తెలీని రైలు వెళ్ళిపోయింది.

ప్లాట్‌ఫారం అంచున యాదవరెడ్డి శరీరంలోంచి ఫౌంటెన్‌లా ఎగజిమ్మిన నెత్తురు చుక్కలు......

పట్టాల మీద ఎగురుతున్న వందరూపాయల మీద పడి నిగనిగమని మెరుస్తున్నాయి.

అవి నెత్తురు చుక్కలు కావు..........గడ్డకట్టిన కన్నీటి చుక్కలు...........

యాదవరెడ్డి రెక్కలుతెగిన పక్షిలా విలవిల్లాడుతున్నాడు.

*  *  *  *  *

మరో పది గంటలు తర్వాత-

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు దగ్గర్లో వున్న........

లాడ్జిల్లో..........

ఓ డబుల్ రూమ్‌లో............

అద్దంలోతనను తాను చూసుకుని లక్ష్మి మురిసిపోతోంది.

లేత గులాబీ రంగు చీర, జాకెట్టులో అప్పుడే పూచిన గులాబీ పువ్వులా వుంది లక్ష్మి!

కొన్ని గంటల సమయంలో ఆమె స్వరూపం పూర్తిగా మారిపోయింది.

ఆ సమయంలో-

లక్ష్మి సరదాగా చౌకబారు హోటల్‌ని చూడటానికొచ్చిన లక్షాధికారి కూతురులా వుంది.

షాంపు పరిమాళాల్ని వెదజల్లుతున్న పొడవాటి జుత్తు, తెల్లని దేహఛాయ, అంతంత

రోల్డుగోల్డువైనా బంగారంలా మెరుస్తున్న గాజులు, జడ తాచుపాములా వుంది జడ చివర రిబ్బన్‌ని ముడి వేసుకుంటోందామె.

రూమ్ బయట కూర్చున్నారు కుమారస్వామి, నర్సింహ.

"చూశావా పిల్ల ఎలాగుందో! మేకప్ వేసి బొంబాయి తీసుకెళితే

మాధురీదీక్షిత్ బాబులా వుంటుంది. ఒరేయ్ స్వామీ! ఒక్కసారి ముద్దెట్టుకో మంటావేటి?" ఉత్సాహంగా అన్నాడు నర్సింహ.

కుమారస్వామి విసుక్కున్నాడు.

"అదే వద్దని చెప్పాను. ఆడపిల్ల కావలిస్తే ఇంకో చోటికెళ్ళు.......డబ్బులు పడెయ్! కానీ బ్రోకరు బిజినెస్సయినా కొన్ని సూత్రాలు పాటించాలని లక్షలసార్లు చెప్పాను పనసపండు లాంటి పిల్ల........మగోడి రుచి తెలీని పిల్ల.......ఆరువేలు ఖర్చుపెట్టాం. మూడింతలు రావాల......ఒరేయ్ నర్సింహా ఒకటి చెబుతున్నాను వినుకో! బిజినెస్‌లో జనరల్ సూత్రాలు కాకుండా పర్సనల్ సూత్రాలుంటాయి మనం ఏర్పాటు చేసుకున్న సూత్రాల్ని మనవే దాటేవేశావనుకో! మరి మనం బిజినెస్సుకి పనికిరాం. ఆడుక్కోవాల........గుర్తుంచుకో" సీరియస్‌గా చెప్పాడు కుమారస్వామి.

"నువ్వెప్పుడూ ఇంతే......." చిరాకుపడి "ఇంతకీ ఆ మార్వాడి పేట్‌కి రేటెంత చెప్తావ్?" అడిగాడు నర్సింహ వుత్సాహంగా.

"నువ్వు కంగారుపడి నన్ను కంగారుపెట్టకు బంగారు బాతుని కోసుకోకూడదు. అమ్ముకోవాల........కేసుని ఎలా డీల్ చేస్తానో చూడు ఈ దెబ్బతో మన జాతకం మారిపోవాల......."

హుషారుగా నవ్వుతూ అన్నాడు కుమారస్వామి.

అదే సమయంలో-

హోటల్ ముందు బ్లాక్ కలర్ అంబాసిడర్ కారు ఆగింది.

అందులోంచి దిగాడు అరవై ఏళ్ళ మార్వాడీ పేఠ్ చంపక్‌లాల్.

సేఠ్‌ని చూడగానే పరుగు పరుగున వెళ్ళి ఆహ్వానించిన లోనికి లక్ష్మిని చూడగానే నిర్ఘాంతపోయాడు.

లక్ష్మి బొంబాయి రేటుని మనసులోనే క్యాలిక్యులేట్ చేసుకున్నాడు సేఠ్ చంపక్‌లాల్!

"మాల్ అచ్ఛా హై....బహుత్ పసంద్‌హై........" ఖుషీగా నవ్వుతూ అన్నాడు చంపక్‌లాల్.

చంపక్‌లాల్‌ని రూక్‌లోంచి బయటకు తీసుకొచ్చారిద్దరూ! పక్కనే వున్న బార్ వైపు నడిచారు ముగ్గురూ.

* * * * * * * *

“మాల్ అచ్ఛా హై భాయ్! కానీ పల్లెటూరిపిల్ల.............” చంపక్‌లాల్ వ్యాఖ్యానించాడు

“రేటు.......రేటు.......” నర్సింహ టెన్షన్‌గా అన్నాడు.

“దస్ హజార్.......” ఆలోచిస్తూ చెప్పాడు చంపక్‌లాల్.

“పదివేలా? మా ఖర్చులే పదివేలయ్యాయి.  యాభైవేలు......ఒకటేమాట......”అన్నాడు కుమారస్వామి.

“లేతపిల్ల! ముక్కూ, కళ్ళూ బాగున్న ఆ మాత్రం సరిపోతుందా? ఎంత తిండి పెట్టాలి..... ఎంత ట్రైనింగివ్వాలీ............బజార్లోకి తీసికెళ్ళేలోపు  నాకెంత ఖర్చవుతుందో నువ్వాలోచించావా?” చంపక్‌లాల్ అన్నాడు.

“పురుషుడి చెయ్యి పడని పిల్ల తర్వాత నీ యిష్టం సాయంత్రం ఏడు గంటలవరకూ టైమిస్తున్నాను......ఆలోచించుకో ఫోన్ చెయ్యి....... కుమారస్వామి లేచి నిలబడ్డాడు.

“నలభై ఆఖరి మాట” అన్నాడు చంపక్‌లాల్.

“ఇంకో అయిదు వేలు కలుపు” అన్నాడు కుమారస్వామి

హేండ్ బ్యాగ్‌లోంచి డబ్బు తీసి టేబుల్ మీద పెట్టాడు చంపక్‌లాల్.

“ఇవాళే బొంబాయి ఎక్స్‌ప్రెస్‌కి తీసికెళ్ళండి ఫోను చేసి చెప్తాను” బొంబాయి విక్టోరియా టెర్మినల్‌లో దిగి ఎక్కడికి  వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో చెప్పాడు చంపక్‌లాల్.

“ఈ పిల్లని ఎలా తీసుకెళ్తారు......మూడో కంటికివాడి క్కూడా అనుమానం రాకుండా తీసికెళ్ళాల” జాగ్రత్తలు చెప్పాడు చంపక్‌లాల్.

గ్

“ఆ విషయం మా కొదిలేయ్ గురూ” కుమారస్వామి హుషారుగా అన్నాడు.

*          *          *          *          *          *          *

నాంపల్లి రైల్వే స్టేషన్ ...........

బొంబాయి ఎక్స్‌ప్రెస్ బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

రైల్వే సెకెండ్‌క్లాస్ కంపార్టుమెంట్లో సీట్లో కూర్చుంది  లక్ష్మి.

ఇంజెక్షన్ యివ్వడంవల్ల మత్తుగా కూర్చుంది లక్ష్మి.  స్పృహలోనే వున్నాఆమెకేం తెలీటంలేదు.

కళ్ళముందు మసక చీకటి.   ఆమెకు ఎదురుగా కూర్చున్న కుమారస్వామి పంచె, లాల్చీలో పెద్దమనిషి  తరహాగా కూర్చున్నాడు.  ఆ ప్రక్కనున్న నర్సింహ బ్యాగీ ప్యాంటు షర్టులో వేషం మార్చుకుని కూర్చున్నాడు.  వాళ్ళను చూస్తే, ఎవరికీ అనుమానం రాదు.

నెలకు రెండు సార్లు రకరకాల వేషాలతో, అమ్మాయిల్ని  బొంబాయికి తీసికెళ్ళి అమ్మేసి విద్యలో  ఆరితేరినవాడు కుమారస్వామి.

రాత్రంతా ఆ కంపార్టుమెంట్లో కొచ్చే కొత్తవ్యక్తుల్ని అప్రమత్తంగా పరిశీలిస్తూ కూర్చున్నాడు కుమారస్వామి.

*            *            *            *            *            *

ఓల్డ్ఢిల్లీలో చాణిక్యపురి ఏరియా.

ఫైవ్‌స్టార్ హోటల్లా వున్న అయిదంతస్తుల భవనంలో -

అయిదో అంతస్తులో విశాలమైన ఏ సీ. రూమ్‌లో కూర్చున్నాడు ప్రమోద్.

మహంత బిజినెస్ వరల్డ్ ఇండియా బ్రాంచ్‌కి ప్రమోట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్.

అతను ప్రస్తుతం కార్డ్‌లెస్ టెలీఫోన్లో, మహంత చెప్తున్నదాన్ని కద్దగా వింటున్నాడు.

"దేశముఖ్ ఇండియాలో ఎక్కడకెళ్ళినా, అతన్ని మన మనుషులు రహస్యంగా అనుసరించాలి. అతను కలిసే వ్యక్తులు, అతన్ని కలిసే వ్యక్తులమీద నిఘా ఏర్పాటు చెయ్యాలి. ప్రతి విషయాన్నీ ఎప్పటికప్పుడు న్యూయార్క్‌లోని మన హెడ్ అఫీసుకి ఇన్టిమేట్ చెయ్యాలి" సీరియస్ విన్పిస్తోంది మహంత గొంతు.

"ఎస్ చీఫ్" ప్రమోట్ వినయంగా అన్నాడు.

"బీ ఎలర్ట్ మాన్! ఐ విల్ కాల్ యూ లెటర్" ఫోను పెట్టేయడంతో దీర్ఘనిశ్వాస విడిచాడు ప్రమోద్.

అకస్మాత్తుగా మహంత చూపు దేశ్‌ముఖ్ మీద ఎందుకు పడింది ఎప్పుడూ ఏ విషయమూ డైరెక్టగా చెప్పమని మహంత ఎందుకు ఈవిషయాన్ని తనే స్వయంగా డీల్ చేస్తున్నారు.

అన్ని రకాలుగా ఆలోచిస్తున్నాడు ప్రమోద్. ఎక్కడా అతని లంగరు అందటంలేదు.

ఆటో మెటిగ్గా అతని చెయ్యి కార్డులెస్ టెలీఫోన్‌ని అందుకుంది. ఎస్. టి.డి కోడ్ ప్రెస్ చేశాడు. తర్వాత-

బిజినెస్ వరల్డ్ బొంబాయి బ్రాంచ్ ఆఫీసు నెంబర్‌ని ప్రెస్ చేశాడు

రెండు క్షణాల తర్వాత-

బొంబాయి ఆఫీసులో ఫోను మోగింది.

ఆ ఆఫీసు బొంబాయిలో ఇండియాగేట్‌కు, మూడుకిలోమీటర్ల శివ శక్తి నగరులో వుంది.

ఆ ఆఫీస్ అప్పుడే తన ఛాంబర్‌లోకి ప్రవేశించిన పరుగులాంటి నడకతో టేబుల్ దగ్గరకెళ్ళి-

ఫోను రిసీవర్ అందుకుంది.

"ఎస్! సాకేతా హియర్."

ముప్పై ఏళ్ళ సాకేత అరవిచ్చిన రబ్బర్ గులాబీలా అలా వుంటుంది సన్నంగా, పొడవుగా, నిండైన స్త్రీత్వానికి, కనువిందైన నిదర్శనంలా వుంటుంది సాకేత.

"మిస్ సాకేత! అయామ్ ప్రమోద్."

"గుడ్‌మార్నింగ్ బాస్! చెప్పండి"

ప్రమోద్ చెప్పటం ప్రారంభించాడు.

*  *  *  *  *  *  *